

తక్కువ వేతనం ఇవ్వడం సరికాదు : సిఐటియు

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిజిహెచ్‌లో రిమ్స్ సెక్యూరిటీ కార్మికులకు రూ.18,600 ఇవ్వాల్సి ఉండగా రూ.11,695 ఇవ్వడం సరైంది కాదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న సెక్యూరిటీ వారికి రూ.18,600 ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జూన్‌లో కేవలం రూ.11,695 ఇవ్వడంలో అంతర్యమేమిటని తెలిపారు. పిఎఫ్, ఇఎస్ఐ అప్డేట్ లేకపోవడం, కార్మికుల వేతనాల్లో కోత కోయడం సరికాదని పేర్కొన్నారు. ఇప్పటికైనా రిమ్స్, లేబర్ అధికారులు జోక్యం చేసుకుని కార్మికులకు ఇవ్వాల్సిన డబ్బులు వెంటనే వెనక్కు ఇప్పించాలని తెలిపారు. తక్కువ వేతనం ఇస్తున్న ఈగల్ హంటర్ సొల్యూషన్ లిమిటెడ్ పై విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రిమ్స్ అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఇదేవిధంగా కొనసాగిస్తే ఆందోళన చేస్తామని పేర్కొన్నారు.

అవినీతి సొమ్ము రికవరీ చేయాలి

- అఖిలపక్ష సమావేశంలో నాయకుల డిమాండ్

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నగరపాలక సంస్థలో చెత్త పన్ను అవినీతికి పాల్పడిన వారి నుంచి దుర్వినియోగం చేసిన సొమ్ము రికవరీ చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కడప నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట చెత్త పన్ను అవినీతి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ అధ్యక్షతన అఖిలపక్ష పార్టీల, ప్రజాసంఘాల సమావేశం నిర్వహించారు. నగరపాలక సంస్థలో పాలకవర్గం కుర్చీల కోసం కొట్లాడుతుంటే అధికార యంత్రాంగం నగరంలో వసూలు చేసిన పన్నులన్నీ ఇష్టానుసారంగా దుర్వినియోగం చేశారని విమర్శించారు. చెత్త పన్ను అవినీతి 2020 సంవత్సరం నుంచి జరుగుతోందని, అప్పటి నుంచి ఇప్పటివరకు మొత్తం అవినీతి మీద ఒక నిజాయితీ గలిగిన ఐఎఎస్ అధికారి చేత సమగ్ర విచారణ జరిపించాలన్నారు. కంటితుడుపు చర్యలు మాని లోతుగా పరిశీలన చేసి అవినీతిలో భాగస్వాములైన వారి వాస్తవాలను వెలికి తీయాలని చెప్పారు. అధికారులు ఇంత పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతుంటే పాలకవర్గం, ప్రభుత్వం ఏం చేస్తుందని వారు ప్రశ్నించారు. అవినీతి పాల్పడిన అధికారుల మీద క్రమశిక్షణ చర్యలకు మాత్రమే పరిమితం కాకుండా వారిపై కఠిన చర్యలు తీసుకుని కేసు నమోదు చేయాలని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. ఏయే అధికారి స్థాయిలో ఎంత అవినీతి జరిగిందో ఆ మొత్తం అవినీతి సొమ్మును కార్పొరేషన్ ఖజానాకు జమ చేసేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఎలాంటి అవినీతినైనా అఖిలపక్షం దృష్టికి తీసుకురావాలని, ఆ మేరకు ప్రజలకు అన్ని అఖిలపక్ష పార్టీలు అండగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ అవినీతిపై జరిగే పోరాటానికి ప్రజానీకం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలోసిపిఎం నగర కార్యదర్శి రామమోహన్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మనోహర్, సిపిఐ నగర కార్యదర్శి వెంకటశివ, జిల్లా నేత భాగ్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్ హరి నారాయణ, కాంగ్రెస్ పార్టీ నేతలు సత్తార్, ఆలీఖాన్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు డబ్ల్యూ రాము, ఓబయ్య, ఆర్ఎంపీఎల్ నేత రమణయ్య, ఆర్పీపీ నగర కార్యదర్శి మగ్బల్ బాషా, ఆమాద్మీ నేత డాక్టర్ శ్రీనివాసులు, లోక్ సత్తా నేత శ్రీకృష్ణ దేవరాయలు డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు సుబ్బమ్మ, దస్తగిరిరెడ్డి, చంద్రారెడ్డి, కుమారస్వామిరెడ్డి, కామేశ్వరమ్మ, రామకృష్ణారెడ్డి, కెవిపియస్ జిల్లా కార్యదర్శి జకరయ్య, కెవిపియస్ నగర కన్వీనర్ నరసింహ, జార్జి, నారాయణరెడ్డి, సరిత, రాజమణి, సిపిఐ నాయకులు శివ నాగేంద్ర, మల్లికార్జున,ఆర్పీపీ నాయకులు మడగల ప్రసాద్, విజయ్, శ్రీను, ఉదయ్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ఉప ఎన్నికలు

- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత

మీడియాతో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

పులివెందుల జడ్‌పిటిసి ఉప ఎన్నికలో పోలీసులను అడ్డు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని చంద్రబాబు నాయుడు ఆదేశాలు ఇచ్చారని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలీసులను అసభ్యంగా సతీష్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి మాట్లాడి భయ భ్రాంతులకు చేస్తున్నారని పేర్కొన్నారు. 2019లో, 2024లో జగన్‌కు ఎన్ని ఓట్లు వచ్చాయో గమనించాలన్నారు. రెవెన్యూ, పోలీసులను బెదిరిస్తు ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నది వైసిపినే అన్నారు. సునీతను కూడా చంపుతారేమో అని పులివెందులకు రావద్దని తల్లి సౌభాగ్యమ్మ చెప్పారంటే అంతకన్నా దారుణం ఏముంది అన్నారు. గతంలో తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. పింఛన్లు, సంక్షేమ పథకాలు టిడిపి కార్యకర్తలకు ఇవ్వలేదన్నారు. ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి అవినాష్‌రెడ్డి మాట్లాడడం దయ్యాలు వేదాలు వర్ణించినట్టుగా ఉందని ఎద్దేవ చేశారు. వైసిపి అరాచకాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని పేర్కొన్నారు. 40 ఏళ్లుగా అధికారంలో ఉండిమంచి నీళ్లు కూడా ప్రజలకి ఇవ్వలేని పరిస్థితి అన్నారు. ప్రజల అమాయకులు కాదని చంద్రబాబు నాయుడు చేసే అభివృద్ధిని చూసి ఓటు వేస్తారన్నారు. ఓటమి భయంతోనే వైసిపి నాయకులు అలా మాట్లాడుతున్నారన్నారు. సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, టిడిపి నాయకులు లింగారెడ్డి పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే దాడులు : ప్రభుత్వ విప్ 'ఆది'

ఉప ఎన్నికల్లో ఓటమి భయంతోనే వైసిపి నాయకులు టిడిపి వారిపై దాడులకు పాల్పడుతున్నారని ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పులివెందులలోని వై.ఎస్. వివేకానందరెడ్డి నివాసంలో ఆదినారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా వివేక కుమార్తె డాక్టర్ సునీతను కలిశారు. ఈ సందర్భంగా విలేఖరులతో ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ వివేకానంద రెడ్డి హత్య కేసును ముందుగా తమపై మోపారని, అది అసత్యమని తేలిందని పేర్కొన్నారు వై.ఎస్.అవినాష్ రెడ్డి వివేకానంద రెడ్డి హత్య జరిగిన రోజున దగ్గరుండి రక్తపు మరకలను తుడిపించారని, ఇది పులివెందుల ప్రాంత ప్రజలందరికీ తెలుసునని అన్నారు. వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఈ విషయం తెలిసి కూడా హత్య జరిగిన రోజు ఆలస్యంగా పులివెందులకు వచ్చారని చెప్పారు. కోడి కత్తి డ్రామాతో పాటు వైసిపి ఎన్నికలలో ప్రతిదీ కట్టుకథలు ప్రజలు మభ్య పెట్టేందుకు అల్లుతూ ఉంటారని పేర్కొన్నారు. వాస్తవాలను కప్పిపెట్టి అసత్య ప్రచారాలను చేస్తూ ఎన్నికలలో గెలుపు కోసం ప్రయత్నాలు చేస్తుంటారని పేర్కొన్నారు. వివేకా హత్య కేసుకు సంబంధించి కేంద్ర హోం మంత్రి అమిత్ షాపుతో కూడా మాట్లాడమని దీనికి సంబంధించి తప్పకుండా న్యాయం జరుగుతుందన్న ఆశాభావంతో ఉన్నామని చెప్పారు.జగన్ బటన్ నొక్కడం తప్ప ఇంకేమీ రాదని పులివెందుల ప్రాంతాన్ని అభివృద్ధి చేసింది వైసిపి కాదని కూటమి ప్రభుత్వం చెప్పిన ప్రతి హామీని రాబోయే రోజుల్లో అమలు చేస్తుందని పేర్కొన్నారు

పోలింగ్ కేంద్రాల్లో సిసి కెమెరాలు అమర్చాలి

- అడ్డగోలుగా పోలింగ్ కేంద్రాల మార్పు

- ఎంపీ వై.ఎస్.అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మాట్లాడుతున్న వై.ఎస్. అవినాష్‌రెడ్డి

జడ్‌పిటిసి ఉప ఎన్నికలలో ఓడిపోతామని భయంతో టిడిపి కుట్రలు పన్నుతుందని, అడ్డగోలుగా పోలింగ్ కేంద్రాలను మార్పులు చేస్తున్నారని, పోలింగ్ కేంద్రాలలో సిసి కెమెరాలను అమర్చాలని కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక గ్రామంలో ఉన్న ఓటర్లు మరో గ్రామంలో ఉన్న పోలింగ్ కేంద్రానికి మార్చడం వల ఓటు వేసేందుకు నాలుగైదు కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుందన్నారు. 2021 సంవత్సరం ప్రకారం పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయాన్ని జిల్లా, రాష్ట్ర ఎన్నికల కమీషన్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. నల్లపురెడ్డి పల్లి, ఎర్రబల్లి, నల్లగొండు వారిపల్లి గ్రామాల ఓటర్లకు ఓటు వేసే పోలింగ్ బూత్‌లకు మధ్య దూరాన్ని పెంచి ఓటర్లను ఎన్నికలలో పాల్గొనకుండా చూడాలని కుట్ర పన్నుతున్నారన్నారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహించే విధంగా ఎన్నికల కమిషన్ చూడాలన్నారు.

రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎస్‌పి ఇ.జి. అశోక్ కుమార్ ఆదేశాల మేరకు, కడప ట్రాఫిక్ సిఐ డి.కె.జావీద్ ఆధ్వర్యంలో నగరంలోని శ్రీ వివేకానంద మహిళా డిగ్రీ కళాశాలలో రహదారి భద్రత ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు మీద ఒక్కరూ చేసే తప్పు, పక్కవారికి ప్రాణాపాయం కలిగించొచ్చని తెలిపారు. హెల్మెట్ ధరించటం కేవలం చట్టానికి లోబడే కాదని, అది మన భద్రత కోసం, మన కుటుంబాల భద్రత కోసం అని తెలుసుకోవాలన్నారు. మితి మీరిన వేగం, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్స్ ఇవన్నీ ప్రమాదాలకే కాదు, ప్రాణ నష్టం వరకు తీసుకెళ్లే మార్గాలని హెచ్చరించారు. జీవితం విలువైందని, ఒక్క క్షణం నిర్లక్ష్యం, జీవితాంతం బాధను మిగల్చవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ట్రాఫిక్ సిఐ జావీద్

ఉప ఎన్నికల ప్రచారంలో మంత్రులు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

జడ్‌పిటిసి ఉప ఎన్నికల ప్రచారం మండలంలో ఉపందుకుంది. టిడిపి అభ్యర్థి ముద్దకృష్ణారెడ్డికి మద్దతుగా శుక్రవారం మంత్రులు వేర్వేరుగా ప్రచారం నిర్వహించారు. ముస్లిమ్ మైనార్టీ శాఖ మంత్రి ఒంటిమిట్ట పెద్ద మసీదులో ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక నాయకులు పెద్ద మసీదు ముత్తవలి, అమానుల్లా, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి డాక్టర్ జిలానిని కలిసి టిడిపి తరుపున పోటీ చేసే అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని మంత్రి కోరారు. అలాగే రవాణా శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి విస్తృత ప్రచారం చేశారు. ఉదయం చిన్న కొత్తపల్లి, సాలాబాదు, మలకాటిపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు వివరించారు. ముద్దు కృష్ణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారాల్లో రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జి జగన్‌మోహన్‌రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** పులివెందుల మండలం జడ్‌పిటిసి ఉప ఎన్నికలలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి శివకళ్యాణ్ రెడ్డి హస్తం గుర్తు ఓట్లు వేసి గెలిపించాలని తుమ్మలపల్లి గ్రామ పంచాయతీ ఓటర్లను పులివెం దుల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మూలంరెడ్డి ధ్రువకుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు **ఒంటిమిట్టలో వైసిపి ప్రచారం..** ఉప ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా బరిలో ఉన్న ఇరగంరెడ్డి సుబ్బారెడ్డికి మద్దతుగా చింతరాజుపల్లె పంచాయతీలో ఆర్. రమేష్‌రెడ్డి, కొండూరు అజయ్‌రెడ్డి, సగవాసి బాలసుబ్రమణ్యం ప్రచారం నిర్వహించారు. ఈనెల 12న నిర్వహించబోయే జడ్‌పి ఉప ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఇరగం రెడ్డి సుబ్బారెడ్డి భారీ మెజార్టీతో గెలిపిం చాలని కోరారు.

ట్రామా సెంటర్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ట్రామా సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కడప జిల్లా మేధావి సమాఖ్య అధ్యక్షులు వివేకానంద రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. అత్యవసర సమయంలో రోడ్డు ప్రమాదానికి గురైన బాధితులు కడప రిమ్స్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్తే వైద్యులు తిరుపతికి లేదా కర్నూలు తీసుకుని వెళ్లాలని సూచిస్తున్నారని పేర్కొన్నారు. అదే ట్రామా సెంటర్ కడపలో ఉంటే ఎంతో మంది ప్రాణాలు కాపాడుకుంటారన్నారు. ప్రముఖ న్యాయవాది శ్రీనివాసులరెడ్డి కడపలో పేరు పొందిన న్యాయవాది సుధాకర్ బాబ్జి దగ్గర పని చేస్తూ శుక్రవారం గోటూరు వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారన్నారు. 108 ద్వారా రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వెళ్తే రిమ్స్ ఆసుపత్రిలోని అత్యవసర విభాగ సిబ్బంది ఇక్కడ తమకు ఈ వైద్య సంబంధించి సదుపాయాలు లేవని సమాధానం ఇచ్చారన్నారు. గత్యంతరం లేక తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆయన మరణించారని పేర్కొన్నారు. అత్యంత అనుభవం కలిగిన రిమ్స్ వైద్యులకు అన్ని సదుపాయాలు కల్పిస్తే, ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ట్రామా సెంటర్ ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ప్రస్తుత పాలకులు దీని పై దృష్టి సారించాలని కోరారు. కేవలం అతి తక్కువ ఖర్చుతోనే ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయవచ్చన్నారు. ట్రామా సెంటర్ ఏర్పాటు కోసం జిల్లా మేధావి సమాఖ్య పోరాడుతుందని స్పష్టం చేశారు.

ప్రశాంత పోలింగ్ నిర్వహణకు చర్యలు

- కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్/ ఒంటిమిట్ట

పులివెందులలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

ఈ నెల 12న పులివెందుల, ఒంటిమిట్ట మండలాల్లో నిర్వహించబోయే జడ్‌పిఇసి ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రకాల భద్రతా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు పులివెందుల, ఒంటిమిట్ట మండలాల పరిధిలో సమస్యాత్మకంగా గుర్తించిన పలు పోలింగ్ కేంద్రాలను ఎస్‌పి ఇ.జి. అశోక్‌కుమార్, ఆర్ఓ ఓబులమ్మతో కలిసి పరిశీలించారు. ముందుగా పులివెందుల మండలంలోని కనంపల్లె, మొట్నూతల, ఇ-కొత్తపల్లె, నల్లపురెడ్డి పల్లె , నల్లగొండువారిపల్లెల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఒంటిమిట్ట మండలంలోని కొత్తమాధవరం, ఒంటిమిట్ట, మంటపంపల్లె పోలింగ్ కేంద్రాలను కలెక్టర్, ఎస్‌పి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికల పోలింగ్ ను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు మధ్య పోలింగ్ నిర్వహించేందుకు అన్ని రకాల ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్లందరూ తమ ఓటు హక్కును ప్రశాంతంగా సద్వినియోగం చేసుకునేలా పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి భద్రతా చర్యలు చేపడుతున్నామన్నారు.

తప్పు చేసిన వారికి శిక్ష పడాలి

- మాజీ మంత్రి వివేకా కుమార్తె సునీత

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డితో మాట్లాడుతున్న సునీత

ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డిని చిన్నపిల్లాడిగా చూశామని, అతనే వై.ఎస్. వివేకానందరెడ్డి హత్యకు కారణమవుతాడని ఊహించలేదని, సాక్షులను లేకుండా చేయడానికి ప్రయత్నిస్తున్నారని, తప్పు చేసిన వారికి శిక్ష పడాలని మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి కుమార్తె వైఎస్ సునీత పేర్కొన్నారు. శుక్రవారం తన తండ్రి వివేకా 74వ జయంతి సందర్భంగా పట్టణంలోని ఆయన సమాధికి తన భర్త రాజశేఖరరెడ్డి, కుటుంబ సభ్యులతో కలసి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వివేకానందరెడ్డి పార్కు వద్ద ఉన్న విగ్రహానికి పూలమాల వేశారు. తర్వాత తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వివేకా హత్యకు కారణం ఆదినారాయణరెడ్డి, సతీష్‌రెడ్డి, బిటెక్ రవి అని ఒక లేఖ రాసుకొని తీసుకువచ్చి సంతకం పెట్టమని వై.ఎస్.అవినాష్ అడిగారు అన్నారు. పోలీసుల సమక్షంలోనే రక్తపు మడుగులను తుడచడం, గాయాలకు కట్టు కట్టడం చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత సిట్ అధికారులను మార్చారని చెప్పారు. న్యాయస్థానం చొరవతో కేసును సిబిఐకి అప్పగించడం జరిగిందని ఆమె తెలిపారు. సిబిఐ అధికారులు విచారణ చేయకుండా అడ్డుకొని వారిపై కేసులు కూడా పెట్టారని చెప్పారు. కర్నూలులో అవినాష్‌ను సిబిఐ అరెస్టు చేసే సమయంలో పోలీసులు వ్యవహరించిన తీరు చాలా బాధాకరమన్నారు. ఇవన్నీ గత ప్రభుత్వంలో చేసి ఇప్పుడు పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా వివరిస్తారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

సునీతతో ఆదినారాయణరెడ్డి భేటీ

మాజీ మంత్రి వై.ఎస్.వివేకానందరెడ్డి కుమార్తె వై.ఎస్. సునీతతో జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి భేటీ అయ్యారు. శుక్రవారం జడ్‌పిటిసి ఉప ఎన్నికల సందర్భంగా పులివెందులకు ప్రచార నిమిత్తం వచ్చిన ఆదినారాయణరెడ్డి వై.ఎస్. వివేకానందరెడ్డి ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వై.ఎస్. సునీత ఆమె భర్త రాజశేఖర్ రెడ్డి, తల్లి సౌభాగ్యమ్మతో భేటీ అయి జడ్‌పిటిసి ఉప ఎన్నికల్లో కూటమి అభ్యర్థి గెలుపు కోసం మద్దతు ఇవ్వాలని కోరినట్టు తెలుస్తుంది. అలాగే వివేకా హత్య కేసుకు సంబంధించి చర్చకు వచ్చినట్టు సమాచారం. వై.ఎస్. సునీత చంద్రబాబు నాయుడు డైరెక్షన్‌లో నడుస్తున్నారని వైసిపి నాయకులు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఉప ఎన్నికల నేపథ్యం , వివేకా హత్య కేసు న్యాయస్థానంలో విచారణ చివరి దశలో ఉన్న సమయంలో వీరిద్దరి భేటీ చర్చనీయాంశ మైంది.

భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డికి నోటీసులు

- రెండు,మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం

ప్రజాశక్తి- పులివెందుల టౌన్ : టిడిపి నాయకుడు విశ్వనాథరెడ్డిని ఇటీవల ఫోన్‌లో బెదిరించిన కేసులో వై.ఎస్. భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డికి పులివెందుల పోలీసులు 41-ఎ నోటీసులు జారీ చేశారు. శుక్రవారం హైదరాబాద్ వెళ్లి ఇద్దరికీ నోటీసులు అందజేశారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో వీరిద్దరూ నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే. పులివెందుల మండల ఉపాధ్యక్షుడు, తుమ్మలపల్లికి చెందిన విశ్వనాథరెడ్డి ఇటీవల బిటెక్ రవి సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ నేపథ్యంలో భాస్కర్‌రెడ్డి, శివశంకర్ రెడ్డి, ఎంపీ అవినాష్ రెడ్డి పిఎ రాఘవరెడ్డి, తుమ్మలపల్లి గ్రామానికి చెందిన గంగాధర్‌రెడ్డి తీవ్ర స్థాయిలో బెదిరించినట్లు విశ్వనాథ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఫోన్ కాల్ డేటా ఆధారాలను కూడా పులివెందుల పోలీసులకు అందజేశారు. వీరందరిపైనా పోలీసులు ఈనెల 5న కేసు నమోదు చేశారు. అయితే, వివేకా హత్య కేసులో నిందితులుగా ఉన్న భాస్కర్ రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి హైదరాబాద్‌లో ఉండాలని కండిషన్ బెయిల్ ఉన్నందువల్ల పులివెందుల పోలీసులు అక్కడికి వెళ్లి 41-ఎ నోటీసులు అందజేశారు. రెండు, మూడు రోజులలో వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు.

టిడిపి ఫ్లెక్సీలను తగలబెట్టిన దుండగులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఫ్లెక్సీని కాల్చిన దుండగులు

జడ్‌పిటిసి ఉప ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేసిన టిడిపి ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టారు. మండలంలోని ఇ .కొత్తపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచార సందర్భంగా ఏర్పాటుచేసిన టిడిపి ఫ్లెక్సీలు రోడ్డుకు ఇరు వైపులా ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవి, అభ్యర్థి లతారెడ్డితోపాటు జిల్లా నాయకుల పోస్టర్లతో వెలసిన ఫ్లెక్సీలను కాల్చి వేశారు. ఈ ఘటనపై టిడిపి శ్రేణులు పులివెందుల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొంతమంది అనుమానితులను పోలీసులు అదుపులోనికి తీసుకుని విచారిస్తున్నారు. నాలుగు రోజుల నుంచి జరుగుతున్న ఘర్షణలతో పులివెందుల రాజకీయం వేడెక్కింది ఇప్పుడు మళ్లీ ఫ్లెక్సీం కాల్చిన సంఘటన ఏ విధంగా మలుపు తిరుగుతుందో అన్న ఉత్కంఠ పులివెందులలో నెలకొంది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కడప : నగరంలో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణలో భాగంగా ఈనెల 9న శనివారం పలు ప్రాంతాలలో విద్యుత్ అంతరాయము కలుగుతుంది కడప టౌన్ -2 సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మా నాయక్ తెలిపారు. ముఖ్యంగా ముత్రాస్‌పల్లి, రెడ్డి కాలనీ, పకీరుపల్లి, ఓం శాంతి నగర్, అబ్దుల్ కలాం కాలనీ, చిన్న చౌక్ విద్యా మందిర్ స్కూల్, భాగ్యనగర్ కాలనీ, దేవుని కడప, గౌస్ నగర్, నిర్మల స్కూల్, మాచుపల్లి రోడ్డు, మాసాపేట, నమస్తే బోర్డు, భారతి బార్, ద్వారకా నగర్, సంధ్యా సర్కిల్, ఎర్రముక్కపల్లి, సిపి బ్రౌన్, మున్సిపల్ ఆఫీసు, ఆర్టీసీ బస్టాండు, పటేల్ రోడ్డు, తదితర ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలియజేశారు.

మంత్రి సవితకు ధన్యవాదాలు

ప్రజాశక్తి - కడప : చేనేతలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అమలు పరచడంలో కీలకపాత్ర పోషించిన సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవితకు టిడిపి తొగట వీర క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు మడకచక్రధర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. శుక్రవారం కడప ఆర్అండ్‌బి అతిథి గృహంలో మంత్రి సవితను మర్యాదపూర్వకంగా మడక చక్రధర్ కలిశారు. చేనేతలకు మేలు చేసినందుకుగాను హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

కుమ్మక్కుతోనే దొంగ ఓట్లు : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప

మీడియాతో మాట్లాడుతున్న అలీఖాన్

బిజెపి, కేంద్రంలోని ఎన్నికల సంఘం కుమ్మక్కై దొంగ ఓట్లకు పాల్పడి 2024 ఎన్నికల ఫలితాలను తారు మారు చేసి ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి దేశద్రోహానికి పాల్పడ్డారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటాన్ మహ్మద్ అలీఖాన్ విమర్శించారు. కడపలోని తన కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరు సెంట్రల్ మహదేవపుర లోక్‌సభ స్థానంలో దొంగ ఓట్ల ద్వారా బిజెపి కేంద్ర ఎన్నికల సంఘం సాయంతో గెలిచిన తీరును రాహుల్ గాంధీ ప్రదర్శించారని తెలిపారు. ఎన్నికల ఫలితాల కుంభకోణానికి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే ప్రధాని నరేంద్ర మోడీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు మయానా రహమతుల్లా ఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులుసయ్యద్ ఇమామ్ పాల్గొన్నారు.

మహిళలకు సౌభాగ్యం సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి- కడప అర్బన్ : తిరుమల తిరుపతి దేవస్థానం వారు వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఎపి తెలంగాణ రాష్ట్రాలలో టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న 52 ఆలయాలలో మహిళలకు సౌభాగ్యం పేరుతో సామగ్రిని పంపిణీ చేశారు. దేవుని కడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో దైవదర్శనానికి హాజరైన మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సత్యవతి ట్యూషన్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్

జనవిజ్ఞాన వేదిక, కడప బాలోత్సవం ఆధ్వర్యంలో పిల్లలలో సృజనాత్మకత పెంపొందించడానికి రవీంద్ర నగర్‌లోని మురదియనగర్‌లో సత్యవతి ట్యూషన్ సెంటర్‌ను ప్రారంభించినట్లు బాలోత్సవం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రాహుల్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పేద పిల్లల కోసం ఈ ట్యూషన్ ప్రారంభించామని చెప్పారు. పిల్లలకు ప్రతి నెలా మన సంస్కృతి ద్వారా మంచిని తెలియచేసే కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పిల్లల్ని విజ్ఞాన వంతులుగా తీర్చి దిద్దడం, దేశభక్తిని పెంపొందించడం లక్ష్యమని తెలిపారు. వారు జాతీయ సమైక్యత ను కలిగి ఉండేటట్లు కృషి చేస్తామన్నారు. కార్యక్రమానికి బాలోత్సవం, జనవిజ్ఞాన నాయకులు అరుణ, వెంకటేశ్వర్లు, సరస్వతి, ఉపాధ్యాయులు విరూపాక్ష, తల్లి దండ్రులు హాజరయ్యారు.

నాలుకలపై నాట్యమాడిన 'పాండవోద్యోగం' పద్యాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

తిరుపతి వెంకట కవులుగా ప్రసిద్ధులైన దివాకర్ల తిరుపతి శాస్త్రి, చెళ్ళపిళ్ల వెంకట శాస్త్రి రాసిన 'పాండవోద్యోగం'నాటకంలో పద్యాలు ఆంధ్రదేశమంతా మారుమోగాయని, ప్రజల నాలుకలపై నాట్యమాడయని వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో తిరుపతి వెంకట కవుల్లో ఒకరైన చెళ్ళపిళ్ల వెంకట శాస్త్రి 156 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. మొదట శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయబార పద్యాలు జనప్రియమైనవని, అవి ప్రజల హృదయాల్లో నాటుకు పోయాయని పేర్కొన్నారు. అదిగో ద్వారక..'బావ ఎప్పుడు వచ్చితీవు'..'చెల్లియో చెల్లకో'.. ' 'జెండాపై కపిరాజు'..తదితర పద్యాలు పల్లెల్లో పశువుల కాపరులు సైతం ఆలపిస్తుంటారని అన్నారు. 1949లో అప్పటి మద్రాస్ ప్రభుత్వం చెళ్ళ పిళ్ల వారిని తొలి ఆస్థాన కవిగా నియమించిందని, విశ్వనాథ సత్యనారాయణ, వేటూరి ప్రభాకర శాస్త్రి, పింగళి, కాటూరి మొదలైన ఆయన శిష్యులు ఎన్నో కావ్యాలు రాసి ఆయనకు అంకితమిచ్చారని చెప్పారు. రిటైర్డ్ తెలుగు అధ్యాపకులు డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ పద్యాన్ని పామరుడు దగ్గరకు తీసుకెళ్లిన అవధాన బ్రహ్మలు తిరుపతి వెంకట కవులని, వాళ్లిద్దరూ కలసి వందలాది అవధానాలు నిర్వహించి తమకు సాటి లేరెవరు అనిపించుకున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రచయితల సంఘం వారు 'పాండవోద్యోగం ' నాటకంలో పాత్రలు పోషించి గొప్ప పేరు ప్రతిష్టలు సంపాదించుకున్న చాకల సుబ్బరాయుడు, అక్కల చంద్ర ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు.

నీటితో కళకళలాడుతున్న ఖాదర్‌పల్లె చెరువు

చెరువులకు జలకళ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని ఖాదర్ పల్లె, నాగులపల్లె, మడూరు చెరువులలో నీరు చేరడంతో జలకళ కనువిందుచేస్తున్నది. ఈ మూడు చెరువులకు కేసీ కెనాల్ అనుబంధ కాలువలు ఉండడంతో అధికారులు చెరువులకు నీటిని విడుదల చేశారు. మూడు చెరువులు నీటితో పూర్తిగా నిండడం తో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ చెరువుల కింద సుమారుగా మూడు వేల ఎకరాలలో వరి పంటలు రైతులు సాగు చేస్తారు. ప్రస్తుతం ఖాదర్ పల్లె, నాగులపల్లె, పల్లవోలు గ్రామాల పరిధిలో వరి నార్లు వేస్తున్నారు. కుందూ, కేసీ కెనాల్ కాలువలలో ఇప్పటికే నీరు ప్రవహిస్తుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

గండి క్షేత్రంలో ట్రాఫిక్ ఆంక్షలు : ఎస్ఐ

ప్రజాశక్తి - చక్రాయపేట

గండిక్షేత్రంలో శ్రావణ మాస మూడవ శనివారం సందర్భంగా తరలివచ్చే లక్షలాది భక్తుల సౌకర్యార్థం ట్రాఫిక్ ఆంక్షలు పెట్టారు. ముందస్తు చర్యల్లో భాగంగా వాహనాల్లో వచ్చే భక్తులకు ఆర్కే వ్యాలీ ఎస్ఐ రంగారావు శుక్రవారం పలు సూచనలు చేశారు. వాహనాల రాకపోకల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు తెలి పారు. దేవస్థానం వద్దకు ఎలాంటి వాహనాలు అనుమతించబోమని తెలిపారు. వేంపల్లి నుంచి గండి, రాయచోటి, కదిరి వైపుగా వెళ్లే వాహనాలు మండలంలోని వీరన్నగట్టుపల్లె క్రాస్ రోడ్డు వరకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. రాయచోటి-కదిరి వైపు నుండి వేంపల్లె వైపు వచ్చే వాహనాలు అద్దాలమర్రి క్రాస్ రోడ్డు వరకు మాత్రమే రావాల్సి ఉంటున్నారు. వీరన్నగట్టుపల్లె క్రాస్ రోడ్డు వద్ద వాహనాలను పార్కింగ్ చేసి, అక్కడి నుంచి వేంపల్లి ప్రయివేట్ పాఠశాలల వాహనాల్లో ఉచితంగా గండిక్షేత్రం చేరుకోవాలని సూచించారు. ఇందుకు భక్తులు, వాహనదారులు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ కోరారు.

ఎస్ఐ రంగారావు

భారీ పోలీసు బందోబస్తు..

గండి క్షేత్రంలో మూడవ శ్రావణ శనివారం సందర్భంగా శుక్రవారం సాయంత్రం డిఎస్పీ మురళీ నాయక్ ఆధ్వర్యంలో 200 మంది పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్ఐ రంగారావు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వేంపల్లి వైపు నుండి వచ్చే వాహనాలు వీరన్నగట్టుపల్లె క్రాస్ వద్ద, రాయచోటి వైపు నుండి వచ్చే వాహనాలు అద్దాలమర్రి క్రాస్ వద్ద నిలిపివేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్కేవ్యాలీ సిఐ ఉలసయ్యతోపాటు ఐదుగురు సిఐలు, 12 మంది ఎస్ఐలు, 200 మంది పోలీసులు, మహిళా పోలీసులు పాల్గొననున్నారు.

మత్తు పదార్థాలు సేవిస్తే కఠిన చర్యలు

రాయలసీమలో ప్రసిద్ధి చెందిన గండిక్షేత్రంలో శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా ఎవరైనా మత్తు పదార్థాలు సేవిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆలయ సహాయ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య హెచ్చరించారు. శుక్రవారం ఆయన గండిక్షేత్రంలో భక్తులకు కావలసిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేవస్థానం తరఫున బ్రీతింగ్ అనలైజర్ (మత్తు పానీయాలు, మత్తు పదార్థములు సేవించిన వారిని గుర్తింపు పరికరం) అందుబాటులో ఉంచామన్నారు.

ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఆలయాల్లో శుక్రవారం వరలక్ష్మి వ్రత పూజలు ఘనంగా నిర్వహించారు. మహిళలు ఉదయం నాలుగు గంటల నుంచి వారి ఇళ్లల్లో వరలక్ష్మి పూజ నిర్వహించి అమ్మవారి ఆశీర్వాదములకు వాయినాలను ఇచ్చిపుచ్చుకున్నారు. ఆలయాలలో పెద్ద ఎత్తున మహిళలు పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన చేశారు. పట్టణంలోని శ్రీవిద్య లక్ష్మీ దేవాలయం, అంకాలమ్మ దేవాలయం, మిట్ట మల్లేశ్వర దేవాలయం, పద్మావతి వెంకటేశ్వర ఆలయంలో అర్చకుల ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీచక్ర సహిత శ్రీలక్ష్మీదేవి అమ్మవార దేవాలయం ధర్మకర్తలు మహిళలకు గాజులు, పసుపు, కుంకుమ అందజేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు.

అల్లాడుపల్లెలో..

చాపాడు : మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అల్లాడుపల్లె వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని ఆలయ పండితులు ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాస శుక్రవారం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు నరేంద్ర, అర్చకులు భద్రయ్య, గోవింద స్వాముల పూజ కార్యక్రమాన్ని నిర్వహించి వరలక్ష్మీ వ్రతం విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ శ్రీనివాసులు, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్, కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ వైస్ చైర్మన్ ద్వారం గురివి రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ శేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెల మందపై దూసుకెళ్లిన గుర్తుతెలియని వాహనం

- 3 జీవాలు మృతి, మరికొన్నిటికి గాయాలు

ప్రజాశక్తి - ముద్దనూరు

కడప-తాడిపత్రి రహదారిలోని శ్రీ మౌనిక మిల్క్ డైరీ సమీపంలో ఉన్న ఈద్గా వద్ద శుక్రవారం ఉదయం రోడ్డు దాటుతున్న గొర్రెల మందపై గుర్తు తెలియని వాహనం దూసుకెళ్లింది. ప్రమాదంలో మూడు జీవాలు మృతి చెందాయి. మరికొన్ని గాయపడినట్లు ముద్దనూరుకు చెందిన గొర్రెల యజమాని సయ్యద్ జాఫర్ తెలిపారు.

మృతి చెందిన జీవాలు

చిన్నపాటి వర్షం పడితే.. ఇందిర కాలనీ చిత్తడే

ప్రజాశక్తి - ఖాజీపేట

చిన్నపాటి వర్షానికే ఖాజీపేట ఇందిర కాలనీ చిన్నపాటి వర్షానికే జలమయంగా మారుతోంది. కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. వర్షపు నీరు బయటికి వెళ్లేందుకు డ్రెయినేజీ వ్యవస్థ అందుబాటులో లేదని, రహదారి అంతా హెచ్చు తగ్గులుగా ఉందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నా పట్టించుకోవడంలేదని ఆగ్రహిస్తున్నారు. వర్షపు నీరు రోజుల తరబడి నిలువ చేరి ఉండడం వల్ల దోమల బెడద ఎక్కువగా ఉందని వాపోతున్నారు. దుర్వాసనతో స్థానికంగా ఉండలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే ఆది

ప్రజాశక్తి - ముద్దనూరు

నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలానే లక్ష్యంతో నిర్వహించిన మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సూచించారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పులివెందుల రహదారిలోని శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు అశేష స్పందన లభించింది. నిరుద్యోగ యువతీయువకులు జాబ్‌మేళాలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వివిధ కంపెనీల్లో ఎంపికైన వారికి ఎమ్మెల్యే ఆది, భూపేష్‌రెడ్డి నియామక పత్రాలను అందజేశారు. మెగా జాబ్‌మేళాలో పాల్గొన్న వారికి మండల నాయకులు డాక్టర్ కటికరెడ్డి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో యువ నాయకులు కటికరెడ్డి గుణవంతరెడ్డి భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఒంటేరు శ్రీనివాసులు రెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి, సాగర్ బాబు, వినోద్, గోపాలకృష్ణ, కళాశాల కరెస్పాండెంట్ అమర్ చక్రధర్‌రెడ్డి, ప్రిన్సిపల్ ప్రసాద్, సిబ్బంది, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ప్రభుత్వ పరిధిలో జరిగే పనుల్లో నాణ్యత ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వ అధికారి దివాకర్‌రెడ్డి ఆదేశించారు. మండలంలోని కోడూరు, చిలమకూరు గ్రామాల్లో ప్రభుత్వ పరిధిలో జరుగు తున్న వివిధ శాఖల పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. పెన్షన్లు అర్హులకు వస్తున్నాయా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసు కున్నారు. చిలమకూరు గ్రామ పంచాయతీలో పిఆర్ ఆధ్వర్యంలో జరిగిన రోడ్డు పనులను పరిశీలించారు. ఉపాధి హామీ ద్వారా జరిగిన పనులను, హార్టికల్చర్ ఆధ్వర్యంలో జరిగిన పనులను, అమృత్ సర్వర్ పనులను, హౌసింగ్ శాఖ ఆధ్వ ర్యంలో జరిగిన ఇంటి నిర్మాణ పనులను స్వయంగా వెళ్లి పరిశీలించారు. అడిషనల్ పీడీ రామలింగేశ్వరరెడ్డి, ఎపిడిలు ఆనంద్, సుబ్బారెడ్డి, ఎంపిడిఒ వెంకటరమణయ్య, ఇఒపిఆర్‌డి రంతులయ్య, ఎపిఒ గంగా భవాని, పిఆర్ ఎఇ వినయ్, డిఆర్‌డిఎ, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

పథకాల అమలుపై లబ్ధిదారులతో ఆరా తీస్తున్న అధికారి దివాకర్‌రెడ్డి

15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు ఇవ్వాలి

మాట్లాడుతున్న జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కేంద్రం నుంచి వచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,121 కోట్లు వెంటనే పంచాయతీలకు విడుదల చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ కోరారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సర్పంచుల వేతనాలు పెంచాలని, గ్రామాల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం ప్రసాదించిన మూడు దొంతరల అధికార వ్యవస్థలో దిగువనున్న స్థానిక సంస్థలకు నిధులు, విధులు బదలాయించడంలో ఇప్పటికీ లోపాలు తీవ్రంగా కనబడుతున్నాయని తెలిపారు. అభివృద్ధిలో స్థానిక సంస్థలైన పంచాయతీలు కీలకపాత్ర పోషిస్తున్నాయని, కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వ కేంద్రీకృత విధానాల వల్ల పంచాయతీల్లో అభివృద్ధి పడకేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సర్పంచులు పార్టీ యేతర ప్రాతిపదికపై ఎన్నికై నాలుగు సంవత్సరాలు గడిచిపోతోందని, ఎన్నో ఆశలతో గ్రామాల్లో అభివృద్ధి చేద్దామనే ఉత్సాహంతో ఎన్నికైన సర్పంచులు నిధులు లేక, ప్రభుత్వ ప్రోత్సాహం లేక ఇక్కట్లు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళ వర్గాలకు చెందిన సర్పంచులు 50 శాతానికిపైగా ఉన్నారన్నారు. వారందరూ అప్పులు తెచ్చి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయిస్తే వాటికి చెందిన బిల్లులు కూడా గత ప్రభుత్వం విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వ దారిలోనే నడుస్తోందని విమర్శించారు. ఆర్థిక సంఘం నిధులు ఇవ్వలేదని, అలాగే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను విద్యుత్ బకాయిల పేరుతో దారి మళ్లించాలని అనుకోవడం దురదృష్టకరమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మొదటి విడత నిధులు విడుదల చేసిన గత ఆరు నెలలుగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు రూ.1,121 కోట్లు విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. వాటి కోసం చాలా కాలంగా ఆందోళన చేస్తున్నా, ఇప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి టిడిపి ప్రభుత్వం శ్రద్ధ చూపాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థలను గ్రామ స్వపరిపాలన ప్రోత్సహించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం నుండి 6 నెలల క్రితం విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామపంచాయతీల ఖాతాలకు వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర ఐదవ ఆర్థిక సంఘం ఏర్పాటు చేసి రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు గత నాలుగు సంవత్సరాలుగా రావలసిన నిధులు బదిలీ చేయాలని కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సర్పంచుల గౌరవ వేతనం రూ.3,000 నుండి రూ.10,000 వరకు పెంచాలని డిమాండ్ చేశారు. పంచాయతీ బిల్లులు ఎప్పటికప్పుడు విడుదలయ్యేలా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. 73, 74 రాజ్యాంగ సవరణ ప్రకారం గ్రామ పంచాయతీలకు సంక్రమించిన 29 అంశాలను రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా బదిలీ చేయాలని కోరారు. సర్పంచులు విధి నిర్వహణలో మరణిస్తే రూ.20 లక్షల వరకు ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించాలన్నారు. 5వ షెడ్యూల్ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాలలోని గ్రామాల అభివృద్ధికి గిరిజన తండాల గ్రామపంచాయతీలకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమల్లో గ్రామ పంచాయతీల పర్యవేక్షణ ఉండాలన్నారు. గ్రామ పంచాయతీలకు రావలసిన రిజిస్ట్రేషన్ సర్‌ఛార్జీలను క్రమం తప్పకుండా పంచాయతీ ఖాతాలో జమ చేయాలని కోరారు. అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వారు వేసే లేఔట్లకు ఇచ్చే పరిమిషన్లకు ఆ పరిధిలోని గ్రామ పంచాయతీల తీర్మానం కావాలని ఆదేశాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్వేష్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.సత్యనారాయణ పాల్గొన్నారు

అనుమతి తీసుకున్న వాహనాలనే ఉపయోగించాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల జడ్‌పిటిసి ఉప ఎన్నిక సందర్భంగా ఎన్నికలలో పోటీచేస్తున్న అభ్యర్థులు ప్రచారం నిర్వహించే సమయంలో తాము ఎన్నికల ప్రచారానికని ముందుగా అనుమతి తీసుకున్న వాహనాలను మాత్రమే ఉపయోగించాలని పులివెందుల డిఎస్‌పి మురళీ నాయక్ తెలిపారు. అనుమతి పొందని వాహనాలను ఎన్నికల ప్రచారంలో ఉపయోగించిన పక్షంలో ఆ వాహనాలను వెంటనే సీజ్ చేసి, సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ విషయమై అభ్యర్థులకు పార్టీ నాయకులకు స్పష్టమైన హెచ్చరిక జారీ చేశామన్నారు. ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించి, చట్టాన్ని ఉల్లంఘించకుండా సహకరించగలరని ఆయన కోరారు.

హార్సిలీహిల్స్ గాలిబండ వద్ద కంచె ఏర్పాటు

ప్రజాశక్తి - బి.కొత్తకోట : మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ కొండమీద మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, మదనపల్లి డిఎస్‌పి మహేంద్ర సహకారంతో గాలిబండ వద్ద కంచె ఏర్పాటు చేసినట్లు పర్యాటక శాఖ అధికారులు పేర్కొన్నారు. మోటార్ సైకిళ్లు, కార్లు తదితర వాహనాలు గాలిబండ వద్దకు వెళ్లకుండా నియంత్రణ చేయవచ్చునన్నారు. గాలిబండ వైపు ద్విచక్ర వాహనాలు, కార్లు వెళ్లడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. పర్యాటకులకు ఇబ్బందులు కలుగుతాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని కంచెను ఏర్పాటు చేశామన్నారు.

76 మందికి వికలత్వ పరీక్షలు

ప్రజాశక్తి- కలకడ

టూల్ ఐడెంటిఫికేషన్‌కు 76 మంది విభిన్న ప్రతిభావంతులు హాజరైనట్లు డిప్యూటీ ఎంపిడిఒ ప్రతాపరెడ్డి తెలిపారు. శుక్రవారం బాటవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు)లో నిర్వహించామన్నారు. క్యాంపును హైదరాబాద్‌కు చెందిన అలిమోకో సంస్థ వారు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో వారికి ఉన్న వికలాంగత్వం నిర్ధారణ అయ్యేలా పరీక్షలు చేసి, వికలత్వ శాతాన్ని బట్టి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు. అలిమోకో సంస్థ డాక్టర్ రాజా వికలాంగులకు పరీక్షలు నిర్వహించిన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు దేవేంద్ర, నందిని, ఉమామహేశ్వరి, సుబ్రమణ్యం, జగన్నాథం రెడ్డి, మరియు జయచంద్రలు పాల్గొన్నట్లు తెలిపారు.

సెక్యూరిటీ సిబ్బందికి పూర్తి జీతం ఇవ్వాలి

- సిఐటియు పట్టణ ఉపాధ్యక్షులు ఎ.వినయ్‌కుమార్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రభుత్వ హాస్పిటల్‌లో పనిచేస్తున్న సిబ్బందికి పూర్తి జీతం చెల్లించాలని సిఐటియు పట్టణ ఉపాధ్యక్షులు ఎ.వినయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వారికి నెలకు రూ.18,600 ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.11,122 ఇవ్వడం సరైంది కాదన్నారు. జిల్లాలో ఉన్న సెక్యూరిటీ వారికి రూ.18,600 ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కానీ జూన్ నెలలో కేవలం రూ.11,122 ఇవ్వడం అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. పీఎఫ్., ఈఎస్‌ఐ అప్డేట్ లేకపోవడం, కార్మికుల వేతనాల్లో కోత దారుణమన్నారు. ఇప్ప టికైనా ఉన్నత అధికారులు, లేబర్ అధికారులు జోక్యం చేసుకొని కార్మికులకు ఇవ్వాల్సిన డబ్బులు వెంటనే వెనక్కు ఇప్పించాలన్నారు. తక్కువ వేతనం ఇస్తున్న ఈగల్ హంటర్ సొల్యూషన్ లిమిటెడ్‌పై విచారించి, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని జిల్లా అధికారులను కోరారు. ఇలాగే కొనసాగిస్తే ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE ;; GOOTY
H.M.O.P.NO.164/2024

Between:
AKULA SIREESHA ...**PETITIONER**
AND
NEELI VIJAYA SIMHA ...**RESPONDANT**

NOTICE TO THE RESPONDENT

TO,
Neeli Vijaya Simha S/o Neeli Chandrasekhar,
Private Employee,
R/o Jammalamadugu Town & Mandal,
Y.S.R Kadapa District.

పై అర్జీదారులు తనకు నీతో 15-02-2019వ తేదిన శ్రీ బాలాజీ ఫంక్షన్ హాల్, పుట్లూరు రోడ్డు, తాడిపత్రి టౌన్ వద్ద జరిగిన వివాహమును రద్దు చేయవలమునని పై కోర్టులో అర్జీని దాఖలు చేసుకొనినది. కోర్టు వారు సదరు అర్జీకి 25-08-2025 తేదికి వాయిదా వేసినారు. కావున నీవు 25-08-2025వ తేదిన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరై అక్షేపణలున్న యెడల తెలుపుకొనవలయును, లేనంతట నీ పరోక్షము నందు తీర్మానించబడునని ఇందుమూలంగా తెలుపుడమైనది.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

Hearing Date: 25.08.2025

K.S. Prabhu Kumar,
A.Suryanarayana,
Advocate for the petitioner
Gooty

ప్రమాదకరంగా స్పీడ్ బ్రేకర్లు

సర్వీస్ రహదారిపై ప్రమాదకరంగా స్పీడ్ బ్రేకర్

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని పూసలకొట్టాలు సమీపం వద్ద కడప-కర్నూలు జాతీయ రహదారికి చెందిన సర్వీసు రోడ్డుపై పలు చోట్ల ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు ప్రమాదకరంగా మారాయి. ఇవి ఉన్నట్లు అక్కడ ఎలాంటి సూచికలు లేకపోవడంతో వాహనదారుల ఇక్కట్లు పడుతున్నారు. వేగంగా వస్తూ దగ్గరికి వచ్చేసరికి వాహనాన్ని అదుపు చేసుకోలేక అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. జాతీయ రహదారి విభాగ అధికారులు సర్వీస్ రహదారులను ఏమాత్రం పట్టించుకోవడంలేదని వాహనదారులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వేగ నిరోధకాలు ఉన్న ప్రదేశాలలో సూచన బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను అరికట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎఇ ప్రియదర్శన్ రెడ్డి తెలిపారు. ముద్దనూరు రోడ్డు, కడప రోడ్డు, వేంపల్లి రోడ్డు, రాణివనం, వినాయక నగర్, సుందరయ్య నగర్, ఎస్టేట్, ప్రొద్దుటూరు రోడ్డులో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. లైన్లు మరమ్మతులు చేస్తున్నందున ఉదయం 8.30గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

పులివెందుల టౌన్ : శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎఇ జగదీశ్వర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పట్టణంలోని చెన్నారెడ్డి కాలనీ, ముద్దనూరు రోడు, టిటిడి కల్యాణ మండపం పరిసర ప్రాంతాల్లో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను మార్చడం, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు చేయడం వంటి పనులతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంద న్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా మురళి

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా మురళి విజయం సాధించారు. కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. ప్రత్యర్థి అభ్యర్థి సుబ్రహ్మణ్యంపై విజయం సాధించారు. ఈ సం దర్భంగా శుక్రవారం మురళి మాట్లాడుతూ.. ఆర్యవైశ్య సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అందరికీ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి పాటుపడ తానన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆర్యవైశ్య ప్రతినిధులు మురళిని సన్మానించారు.

ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవాలి

ప్రజాశక్తి - మైదుకూరు(రూరల్)

మైదుకూరు నియోజకవర్గంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతు సంఘం, సిపిఐ నాయకులు కోరారు. స్థానికంగా వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మైదుకూరు మున్సిపల్ పరిధిలోని ఎల్లంపల్లెకు చెందిన యువరైతు మూలె ఇంద్రసేనారెడ్డి అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడడం బాధాకరమన్నారు. బి.మఠం మండలం లింగాలదిన్నెపల్లెకు చెందిన భూమిరెడ్డి సుబ్బిరెడ్డి అనే రైతు మూడు రోజుల క్రితం ఆత్మహత్య యత్నానికి పాల్పడి, శుక్రవారం ప్రొద్దుటూరు ఆస్పత్రిలో చనిపోవడం మరో దారుణమన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శ్రీరాములు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్, రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు కె.రామాంజనేయులు, సిపిఐ మైదుకూరు పట్టణ కార్యదర్శి డి.సుబ్బరాయుడు, భవన నిర్మాణ కార్మిక సంఘం (ఎఐటియుసి) నాయకులు బి.పీరయ్య, సిపిఐ నాయకులు పి.శంకర్ పాల్గొన్నారు.

తులసిరెడ్డికి సన్మానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యునిగా నియమింపబడిన రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డిని ప్రొద్దుటూరుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పూల నజీర్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నజీర్ మాట్లాడుతూ తులసిరెడ్డి నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా అంచలంచలుగా ఎదగాలన్నారు. అహర్నిశలు కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టతకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో తులసిరెడ్డి మరెన్నో ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. తులసిరెడ్డికి పదవి ఇచ్చినందుకు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, వేణుగోపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహబూబ్ బాషా, మనోవర్, ఖాజాపూర్ పాల్గొన్నారు

తులసిరెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

IN THE COURT OF THE HON'BLE IV ADDITIONAL JUNIOR CIVIL JUDGE-CUM-MOBILE COURT::KADAPA
O.S.No. 979/2024

V.A.Narayana Reddy, S/o V.A.Aswad Reddy, aged about 54 years, Hindu, Business, r/at D.No.1/436-7, Maruthi Nagar, Kadapa City and District. ...**Plaintiff**

Vs

M. Nageswaraiah, S/o M.Chinna Subbulaiah, aged about 55 years, Hindu, Cement Business, r/at D.No.36/203-2, Sriram Nagar, Chinnachowk, Kadapa City and District. ...**Defendant**

SUMMONS TO DEFENDANT

పై తెల్పిన వాది, ప్రతివాది అయిన మీ పైన, పై తెల్పిన రాజశ్రీ కోర్టు వారి యెదుట ప్రామీసరి నోట్ బాకీ వసూలు నిమిత్తం O.S.No.979/2024 అను దావాను దాఖలు చేసి యున్నారు. సదరు దావాలో మీరు హాజరగుటకు గాను వాయిదాను 28.08.2025వ తేదీకి వేసియున్నారు. కావున పై తెల్పిన రాజశ్రీ కోర్టు వారి యెదుట 28.08.2025వ తేదీన ఉదయం 10.30 గం॥లకు మీరు స్వయముగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల తెలుపుకోనగలరు. లేనంతట మీ పరోక్షమున దావా తీర్మానించబడును.

//By the Order of the Court//
ఎమ్. రామాంజనేయరెడ్డి
అడ్వకేట్, కడప.

IN THE COURT OF THE II Addl. JUNIOR CIVIL JUDGE : KADAPA
O.S.No. 296/2024

Naru Kanya Kumari, W/o Obula Narasaiah, aged about 41 years, Housewife, resident of D.No.6/1463, Sankarapuram, Chinnachowk, Kadapa City and District. ...**Plaintiff**

Vs

Poola Lakshmanna, S/o Late Gangi Setty, aged about 60 years, Business, resident of D.No.41/118-6-1-2, Sankarapuram, Kadapa City and District. ...**Defendant**

SUMMONS TO DEFENDANTS

పై దావాలోని వాదికి నీవు ప్రామిసరీ నోట్ రీత్యా చెల్లించవలసిన అమౌంట్ అసలు మరియు వడ్డీ కలిపి మొత్తం రూ.7,36,587/- నీ నుండి రాబట్టుకొనుటకై వాది నీ పైన పై కోర్టులో పై దావా దాఖలు చేసి ఉన్నారు. పై దావాలో మీ హాజరు నిమిత్తమై వాయిదా 21.08.2025 ఉన్నది కావున మీరు 21.08.2025తేదీన ఉదయం 10.30 గం॥లకు పై కోర్టులో స్వయముగా కానీ లేదా వకీలు ద్వారా కానీ హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

//By Order of the Court//
M.SAI NIRANJAN BABU
M.SAI VAMSI KRISHNA
Advocates for Plaintiff,
KADAPA.